# నిస్సహాయుడు

> మంచి అయినా. చెడే అయినా చేసుకు పోతారు కొందరు. ఒకరి అభిప్రాయాలకు ఎప్పుడూ విలువ ఇవ్వరు. కనుక నే ఇతరుల ఆగ్రహానుగ్రహాలకు విశేషంగా గురి అవుతారు. పరిణామాల గురించి ఆలోచించే వారి విషయం వేరు.

**ఎ. వేణుగోపాలురెడ్డి**

**తెనాలి** వెళ్ళే బస్సు బుర్రుమని రొద చేసుకుంటూ వచ్చి, మర్రిచెట్టూ, వేపచెట్టూ అన్యోన్యంగా పెనవేసుకుని పెరిగినచోట ఆగింది. బస్సును వెంటాడుతూ వచ్చిన ఎర్రటి చిక్కటి దుమ్మును దులుపుకుంటూ బస్సులోనుంచి దిగిన ప్రయాణికులు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, కాళ్ళ సలుపు వదిలించుకుంటూ, ఆ చెట్లనీడనే అల్లంత దూరానఉన్న మైసూరు అయ్యరు హోటల్లోకి జొరబడుతున్నారు — ఫలహారాలూ, పానీయాలూ సేవించటానికి. ఇంజను ఆపేసి డ్రైవరు రాజయ్య సీటులోంచి దిగి, "ఒరే గుర్నాథం, బక్కెటు తీసుకెళ్ళి నీళ్ళు పట్రా. రేడియేటరు కాలిపోతంది" అని కండెక్టరును పురమాయించి, జేబులోంచి దువ్వెన తీసి, తల్లో చిక్కగా సమష్టిగా దాదాపు సమపాళ్ళలో పెరిగిన తెలుపు, నలుపు వెంట్రుకల్ని శీవిగా సవరించుకుంటున్నాడు. గుర్నాథం డ్రైవరు సీటులోనుంచి బక్కెటు తీసుకు వెళ్ళి, అయ్యరు హోటల్లోనుంచి నీళ్ళు పట్టుకు వచ్చాడు. రాజయ్య రేడియేటరును ఆ నీళ్ళతో నింపి అయ్యరు హోటలువైపు పోతూండగా "నాన్నా" అన్న పిలుపు విని, వెనక్కు తిరిగి చూశాడు. బస్సు రేకుమీద గోటితో ఏదో గీస్తూ సంకోచంతో నించునున్న తన పన్నెండేళ్ళ కొడుకు ప్రభాకరును చూసి, వాడి దగ్గరికి వెళ్ళి "ఏరా చిన్నా, ఇక్కడ నిలబడ్డావ్? మాటిమాటికీ ఇక్కడికి రావద్దని చెప్పలా? పద. ఇంటికెళ్ళి చదువుకుందువుగాని" అని భుజంమీద చెయ్యివేశాడు.

"లేదు, నాన్నా, రేపు లెక్కలకీ, సైన్సుకీ బౌండ్ నోటు బుక్కులు కొనాలి. లేపోతే క్లాసులోకి రానీనన్నాడు మా టీచరు." ఇంకా బస్సు రేకుమీద గీకుతూనే చెప్పాడు ప్రభాకరు.

"సరేలే, పద. ఇంకా ఏమన్నా కొనాలా?" అని వాడిని హోటలువేపు తీసుకుపోతూ ఆప్యాయంగా అడిగాడు రాజయ్య.

"ఊహుం. ఇంకేమీలేదు" అనేసి మళ్ళీ వెంటనే జ్ఞాపకం తెచ్చుకుని "డ్రాయింగుకి ఒక రంగుల పెట్టెకూడ కావాలి, నాన్నా" అని అడిగాడు ప్రభాకరు ఉత్సాహంతో.

"సరేలే. వీటికంతా ఎంత డబ్బులు కావాల?"

"మూడు రూపాయలు చాలు, నాన్నా."

హోటల్లో బల్లముందర కూర్చుని సర్వరు నుద్దేశించి "ఒరే శివరాం, నాకూ, మావాడికీ రెండు వేడివేడి పెసరట్లు త్వరగా పట్రా. ముందు చల్లటి మంచి నీళ్ళియి" అని కేక వేశాడు రాజయ్య, ఆ హోటలుకు తనే అధికారి లాగా. రాజయ్యంటే అక్కడందరికీ హడలే. అతని భీముడిలాంటి అవయవ పుష్టి, పస్తాదు మీసమూ, స్వేచ్ఛగా బలిసిన అతని పొట్టను గట్టిగా అదిమి పట్టుకున్న మూడంగుళాల




జాగృతి
దీపావళి కథానికల పోటీలు
మొత్తం రు. 1256 లు బహుమతులు
రెండు సాంఘికాలు (రు. 50. రు. 40 లు) ఒక పౌరాణికం (రు. 25 లు)
ఒక చారిత్రకం (రు. 25 లు). సాంఘికాలలో సినిమాకు ఎన్నికైన కథకు
ప్రత్యేక బహుమానం రు. 1116 లు.
కథలు చేరడానికి ఆఖరుతేదీ 10-10-63. గెలుపొందిన కథలు
దీపావళి సంచికలో ప్రకటించబడతాయి.
వివరాలకు : సంపాదకులు, జాగృతి. పోస్టుబాక్సు నెం. 383 విజయవాడ-2

మిక్కిలి శ్రేష్ఠమైన నూనెల్లో నాణ్యమైనది
కాష్మీర్-కుసుం
కేశములను పెరిగించును. అకాలనెరపును తొలగించును.
చర్మము
సౌందర్య
"శ్రేష్ఠమైన ఉదువత్తులు & సువాసనలు & ఫ్లవర్‌డస్ట్
నంజన్‌గూడు పండ్లపొడి & అపూర్వ ఔషధములు
సోలు ఏజంట్లు, యునైటెడ్ ట్రేడర్స్, మదరాసు / హైదరాబాదు / విజయవాడ
నన్‌జన్‌గూడు ఔషధములకు ఒక టౌనుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము.



మీకు నమ్మకమైన
నీలగిరి తైలం
కావాలంటే
కేమిల్ బ్రాండ్ వాడండి
అది కల్తీలేనిది

కంటి రక్షణకు, సౌందర్యానికి
దర్బార్ కాటుక (రిజిస్టర్డు)


రాంబీర్ కంపెనీ, బొంబాయి-4.

# నిస్పృహోయుడు

వెడల్పాటి బెల్టును చూసి అదురుకోనివాడు అరుదు. అతని ఆకారంలోనే గాక చేష్టలలో, మాటల్లోకూడ అదోరకమైన రౌడీ తరహా మోటుదనం కనబడుతూ ఉంటుంది. తనతో అనవసరంగా పేచీ పెట్టుకున్నవాడిని శుభ్రంగా దేహశుద్ధి చేయందే వదిలిపెట్టే స్వభావం కాదతనిది.

కూటికిలేక డ్రైవరుపని చేస్తున్నవాడు కాదు రాజయ్య. తిండికీ, యింటి ఖర్చులకు వెతుక్కో నవసరం లేకుండా సరిపోయేటంత ఆదాయాన్ని తెచ్చిపెట్టగల బంగారంలాంటి మాగాణి ఐదెకరా లుంది స్వగ్రామంలో. అయితే, దాదాపు ఆరేళ్ల క్రితం ఉమ్మడిగా ఉంటూన్న తనకూ, తన పెద్దన్నలిద్దరికీ రాజకీయ వ్యవహారాల్లో ఏవో తగాదాలు రావటంమూలాన ఆస్తి పంపకాలు చేసుకుని కొద్ది మూలధనంతో తెనాలిలో మోటారు సామాన్ల వ్యాపారం పెట్టాడు రాజయ్య. కొంత అదృష్టం కలిసిరానందునా, కొంత అనుభవంలేకా ఆ వ్యాపారంలో ఉన్న పెట్టుబడి కాస్త పోగా, కొంత అప్పుల పాల య్యాడు కూడ. ఇక లాభం లేదని వ్యాపారానికి స్వస్తిచెప్పి, మళ్లీ ఆ స్థితిలో ఊరికెళ్లటానికి మొహం చెల్లక, తెనాలిలోనే స్థిరపడి స్వరాజ్యా బస్సు సర్వీసులో డ్రైవరుగా కుదిరాడు. అతను ఆ కంపెనీలో ప్రవేశించటానికి, డబ్బు సంపా దించటానికన్నా వ్యక్తిగతమైన కారణం వేరే ఉంది.

సర్వరు శివరాం పెసరట్ల ప్లేట్లు రెండు బల్లమీద పెట్టాడు. రాజయ్య వెంటనే ఆ ప్లేటు ఖాళీ చేయటాని కుపక్రమించాడు. కానీ ప్రభాకరు మాత్రం ప్లేటు తాకకుండా దాన్ని చూస్తూ మిటకరిస్తూ కూర్చున్నారు. వాడిని చూసి రాజయ్య "ఏరా చిన్నా, అట్టా గుడ్లు తేలేశావ్? ఆకలెయ్యటంలా?" అని అడిగాడు.

ప్రభాకరు చేతులతో చికాకుగా మోకాళ్ళ రుద్దుకుంటూ, బిక్కమొహం పెట్టి "మా బ్రహ్మన్న టీచరు అడుగో" అన్నట్టు కళ్లతో సైగచేశాడు.

"ఓరి... అదా నీ గొడవ" అని రాజయ్య తమలపాకుల సంపర్కంతో కెంపురంగు పట్టించు కున్న తన పళ్లన్నీ ఒక్కుమ్మడిగా ప్రదర్శిస్తూ పెద్దగా నవ్వి "అతనేనా మీ పంతులు? సరే కానీలే. ముందు నువ్వా పెసరట్టు ఖాళీచెయ్. పోయి మాట్లాడుదాం" అన్నాడు. కాఫీ త్రాగాక ఒళ్లో ఉన్న గళ్ల తువ్వాలు భుజాన వేసుకుని సరాసరి బ్రహ్మన్న పంతులికి ఎదుటి సీటుకువెళ్లి కూర్చుంటూ, "మీరేనా మావాడి పంతులు?" అని పలకరించాడు రాజయ్య స్నేహపూర్వకంగా. ఏదో తీవ్రంగా ఆలోచించుకుంటూ, పరధ్యా న్నంగా టీ త్రాగుతున్న పంతులు ఎదుటి

సీట్లో రాజయ్యను చూడటంతోటే ఉలిక్కి పడ్డాడు. రాజయ్యను ఎప్పుడూ చూడనివాడు కాడతను కానీ, అతను ఊళ్లో కనిపించినపుడల్లా అతని పస్తాదు మీసాలు చూసే సగం హడిలి పోయేవాడు. అందువల్ల రాజయ్య అడిగిన ప్రశ్న తీరును చూసి తనమీద ఏం ఫిర్యాదు చేయబోతున్నాడో నన్న భయంతో అతని నరాలు కొన్ని చప్పగా చల్లబడి పోయాయి. కాని సామ దాన భేద దండోపాయాల్లో పంతులికి మొదటిది తప్ప మిగతావేవీ తెలిదువు. అంచేత మనస్సులో చికాకుగా ఉన్నా, కాస్త చిరునవ్వు వెలిబుచ్చి, "అవును నేనేనండి. ప్రభాకరుగూడ ఇక్కడికి వచ్చినట్టున్నాడే?" అన్నాడు పంతులు, రాజయ్యను అసలు విషయం ఏమిటో చెప్పమనే అర్థోక్తితో.

"ఆఁ వచ్చాడులే. మిమ్మల్ని చూసి అదిరిపోయి పెనరట్టుకూడ ముట్టుకోలా. మంచిదేలే. పిల్లకాయల్ని ఆ మాత్రం అదుపులో పెట్టు కోకపోతే లాభంలేదు పంతులూ" అంటూ అప్పుడే ఏకవచనప్రయోగం ప్రారంభించాడు రాజయ్య.

"వాడి కెందుకండీ భయం, లక్షణంగా వాడు క్లాసులో ఫస్టు మార్కులు తెచ్చుకుంటూాం టేనూ?" అని పంతులు ప్రభాకరాన్ని మెచ్చు కుంటూంటే, రాజయ్య ముఖం చేటంతైంది సంతోషంతో.

తన ప్రక్కనే నిలుచోనున్న ప్రభాకరు నడుం చుట్టూ చెయ్యివేసి ఆప్యాయంగా దగ్గరికి లాక్కుంటూ రాజయ్య "పంతులూ, వీడు కూడ నిన్ను గురించి చాల గొప్పగా అప్పు డప్పుడూ చెప్తూంటాడులే. నువు జెప్పే పాఠా లైతే వీడికి బాగా అర్థమవతాయనీ, పిల్లకాయల్ని మాటిమాటికీ కొట్టకుండా పాఠాలు జెప్తా వనీ అంటుంటాడులే. అందుకే గదూ వీడిం కెవరి దగ్గరికీ పోకుండ పట్టుబట్టి నీదగ్గరే ప్రవేటు చెప్పించుకుంటుంటాడు" అన్నాడు. ఇంతసేపూ భయంతో కంపించిపోయిన పంతులు మనస్సు ఆ మాటలకు కాస్త కుదుట బడ్డది.


ఇంతలో గుర్నాథం వచ్చి "రాజయ్యగోరూ, బస్సుకి టైమైంది. వస్తారా?" అని కేకవేశాడు. "రాజయ్యా" అని పిలవాలంటే గుర్నాథానికి చాల భయం. సర్వీసులో క్రొత్తగా చేరినప్పుడు ఓసారి బస్సులో "రైట్, పోనీవయ్యా, రాజయ్యా" అని చనువుగా, హుషారుగా అన్నాడంతే. వెంటనే రాజయ్య ఇంజను ఆపేసి, సీట్లోంచి దిగి, చరచరా వచ్చి, గుర్నాథాన్ని చొక్కా పట్టుకుని బస్సులోంచి క్రిందకు లాగి "ఏమని అరిచావ్? మళ్లీ అరూ" అని గర్జించాడు. గుర్నాథానికి వణుకుపుట్టి బిక్క మొహంతో "ఇంకట్లా పిలవను, సార్!" అని ప్రాధేయపడ్డాడు. "మరోసారి 'రాజయ్యా' అని పిలిచావా, నీ దవడలు రెండూ ఊడగొడతా. జాగ్రత్త. నీ నౌకర్ననుకున్నావు గావాలు?" అని అదిలించాడు రాజయ్య. అప్పటినుంచీ గుర్నాథం బస్సులో బెల్లు ఉపయోగించటం మొదలెట్టాడు.

అసలు రాజయ్యంటే ఆ కంపెనీలోని యితర డ్రైవర్లు, కండక్టర్లు మాత్రమేగాక మేనేజరు కూడ గౌరవంగా చూస్తాడు. ఎందుకంటే చేస్తున్నది డ్రైవరుపనే అయినా రాజయ్య దర్జాగా ఖర్చు చేస్తాడు; డాబుగా బ్రతుకు తున్నాడు. పైగా తెనాలిలో పెద్ద పెద్ద వ్యక్తు లతో బాగా పరిచయం, పలుకుబడీ ఉన్నాయి. అదీగాక తన కనుకూలంగా నడుచుకునేవాళ్లను ఆపదలో ఎంతటికైనా ఆదుకునే స్వభావం కూడ ఉంది రాజయ్యలో.

రాజయ్య, బ్రహ్మన్న పంతులు దగ్గర సెలవు పుచ్చుకుని, ప్రభాకరుకు ఓ అయిదు రూపాయల నోటిచ్చి "నీకు కావల్సిన పుస్తకాలన్నీ కొను క్కొని, మిగతా డబ్బు అమ్మ చేతికివ్వు" అని చెప్పి, ఖాతాబుక్కులో సంతకం పెట్టి, "పం తులూ, డబ్బులు జేబులోనే ఉంచుకో. నీలెక్క కూడ యిక్కడ రాసేశాలే" అని కేకేసి వెళ్లి పోయాడు. కొద్ది క్షణాల తర్వాత బస్సు అక్కడి నుంచి కదిలిపోయింది.

మొత్తంమీద బ్రహ్మన్నపంతులికి రాజయ్య తోటి అకస్మాత్తుగా కలిగిన పరిచయం అట్టే నచ్చలేదు. ప్రభాకరు తన దగ్గర దాదాపు ఓ ఏడాదినుంచీ ప్రైవేటు చెప్పించుకుంటున్నా, వాడి జీతం ప్రతిసారీ ప్రభాకరు తల్లి అంకమ్మ తీసుకువచ్చి యిస్తూండేది అతనికి. అందుచేత పంతులికి రాజయ్య నెప్పుడూ కలుసుకోవలసిన అవసరం లేకపోయింది. అసలు రాజయ్యతో పరిచయం లేకపోతేనే బాగుంటుందనుకునే వాడతను. ఎందుకంటే తన నడవడికకూ, రాజయ్య ప్రవర్తనకూ ఒక పెద్ద అగాధమంత తేడా ఉంది. దారికడ్డంగా ఆవుదూడ నించున్నా దాన్ని అదిలించక తనే ప్రక్కకు పోయే సాధు స్వభావం పంతులిది. తను బాధ పడుతున్నా యితరుల మనస్సు నొప్పించలేడు. తను, తన గంపెడు సంసారం, తన అగచాట్లు, బ్రతికీ బ్రతకని జీవితం, చాలీచాలని జీతం, ఆ జీతాన్ని బడిపిల్లలకు ట్యూషన్లద్వారా కాస్త వృద్ధి చేసు కోవాలనే తాపత్రయం—వీటితోనే అతని కాల మంతా గడిచి పోతూంటుంది. ఇక ఇతరుల గొడవ —అంటే స్నేహితులూ, బంధువులూ, పరిచయ స్థులూ తోటి తిరగటానికి గానీ, కాలక్షేపం చేయటానికిగానీ అతనికి వ్యవధీలేదు; స్తోమతూ లేదు.

బదిలీమీద ఆ ఊరికి వచ్చినప్పటినుంచీ పంతులికి రాజయ్యతోటి ఇన్నాళ్లుగా పరిచయం లేకపోయినా, అతని విషయమంతా తెలుసు. ఆ ఊళ్ళోని మంత్రసాని సుబ్బమ్మ కూతురు అంకమ్మతో అతనికి చాలకాలంగా 'సంబంధం' ఉంది. అంకమ్మను రాజయ్య రహస్యంగా పెళ్లి చేసుకున్నాడంటారు కొందరు. ఏమైనా అతని భార్యా బిడ్డలు తెనాలిలో కాపురముంటున్నా రన్నది నిజం. వాళ్లకు రాజయ్య అంకమ్మతోటి మరో సంసారం సాగిస్తున్న సంగతి తెలియదట.



ఎదురు తెన్నులు

చిత్రం—రషరేఖ (సికిందరాబాద్)

అసలు రాజయ్య స్వరాజ్యా బస్సు సర్వీసులో డ్రైవరుగా కుదరటానికి ప్రబల కారణం ఏమిటంటే— తనవాళ్లకు ఏవిధంగానూ అనుమానం కలగనీయకుండా, అంకమ్మతో స్వేచ్ఛగా సంసారం కొనసాగించాలని. అలా ఎవరోఅనుకుంటూంటే విన్నాడు పంతులు. అంకమ్మ చూట్టానికి చక్కగా నిమ్మపండు రంగుతో మిసమిసలాడుతూ ఉంటుంది. ముప్పైఏళ్ళ పైబడని వయస్సు. కుట్టుపని నేర్చుకున్నందువల్ల ఇంటిదగ్గర ఆడాళ్ల దుస్తులు కుట్టుతూ కాస్తో కూస్తో సంపాదిస్తూ ఉంటుంది. కానీ, వాళ్ల సంసారానికయ్యే ఖర్చంతా రాజయ్యే భరిస్తూంటాడని వినికిడి. రాజయ్య దాదాపు ప్రతివారం కనీసం రెండు రోజులన్నా అంకమ్మ యింటిదగ్గర గడుపుతూ ఉంటాడు. అందుచేత వాళ్లిద్దరికీ మధ్య ఉంటున్న సంబంధం ఆ ఊళ్లో ఎవరికీ తెలియని రహస్య మేమీకాదు. వాళ్లిద్దరికీ కలిగిన వాడు ప్రభాకరు.

అంకమ్మ స్వాభావికంగా చాల నెమ్మదస్తురాలు. ఆమెను గురించి తక్కిన చెడ్డ పుకార్లేమీ లేవు. అంత నెమ్మదస్తురాలు అంకమ్మకు, తాగుబోతూ, రౌడీలక్షణాలన్నీ ఉన్నరాజయ్యకూ ఎలా పొత్తు కుదిరిందోనని ఆశ్చర్య పోతూంటారు, ఊళ్ళో వాళ్ల [illegible] వాళ్ళు కొందరు. రాజయ్య రౌడీ అని తెలుసుగాని, అతను తన రౌడీతనం ఆ ఊళ్ళో ఎప్పుడూ చెలాయించినట్టు వినలేదు పంతులు. కొన్నిసార్లు మాత్రం అతను పూర్తిగా తాగి, కళ్లు రెండూ నెత్తురు గుడ్లలా మారిపోయి, రోడ్డంట తూగుతూ నడుస్తూండగా చూసి బెదిరిపోయేవాడు పంతులు. అప్పుడతనంటే పూర్తిగా ఏవగింపు కలిగేది పంతులికి. అందుకే అలాంటి వ్యక్తితో పరిచయం లేకపోవడమే హాయి అని పంతులు అభిప్రాయం. మరి యిప్పుడు రాజయ్యే తనతో స్నేహం కలిపాడు. దేనికీ అతనికి కాస్త దూరంగా ఉండటమే మేలనుకున్నాడు పంతులు మనస్సులో. వీలైనంతవరకూ రాజయ్యకిక తటస్థపడకూడదని నిశ్చయించుకున్నాడు.

ఒక నెల రోజుల తర్వాత పంతులు తన పెద్ద కొడుకు రామ్మూర్తిని తెనాలి వెళ్లే బస్సులో ఎక్కించి, తెనాలిలో ఏ హొటల్లో దిగాలో, ఎవరెవరిని కలుసుకోవాలో, ఎంత తక్కువ ఖర్చుపెట్టాలో ఆఖరుసారిగా వివరిస్తున్నాడు బస్సు బయట నిలుచుని. ఇంతలో అయ్యరు హొటల్లోంచి బయటబడ్డ రాజయ్య, పంతులిని చూడటం జరిగింది. సరాసరి పంతులు దగ్గరికి వచ్చి "ఏం పంతులూ, ఇందాకొచ్చావ్?" అని అడిగాడు, అతని భుజం చనువుగా చరిచి. అతన్ని చూడటంతోటే బిత్తరపోయాడు పంతులు. ఎలాగో తమాయించుకుని చిరునవ్వు తెప్పించుకుని "ఏంలేదు రాజయ్యా, వీడు మా పెద్ద బ్బాయి. తెనాలిదాకా పంపిస్తున్నా" అన్నాడు బస్సులో కూర్చొనున్న రామ్మూర్తిని చూపి.

"ఏం పనక్కడ?" రాజయ్య, ముద్దాయిని

# నిస్సహాయుడు

కోర్టులో వకీలు సంజాయిషీ కోరుతున్నట్టుగా, ముక్తసరిగా అడిగాడు పంతులును.

"అబ్బే, పనేమీలేదు. పనికోసం వెళ్తున్నాడు. అక్కడేదో కంపెనీలో గుమాస్తాపని ఖాళీ ఉందంటేనూ, దానికోసం పంపిస్తున్నా."

"అలాగా?" అని రాజయ్య బీడిముక్కను నోటికి పట్టించి "ఒరే గుర్నాథం" అని కేక వేశాడు. కండక్టరు గుర్నాథం కొద్ది క్షణాల్లో "ఏమండీ?" అంటూ అక్కడికి చేరాడు. రాజయ్య బస్సులో కూర్చొనున్న రామ్మూర్తిని చూపిస్తూ, "ఇదుగో, ఈడు మన పంతులుగారి కుర్రాడు. తెనాలి కొస్తున్నాడంట. ఈడిదగ్గిర డబ్బులు పుచ్చుకోకు" అని ఆర్డరిచ్చాడు.


"సరేనండీ" అని గుర్నాథం వెళ్లిపోతూంటే, పంతులు విస్తుపోయి "ఎందుకు, ఎందుకు రాజయ్యా? వాడిదగ్గర డబ్బులున్నాయి" అన్నాడు ఆదుర్దాగా.

"సరేలే పదవయ్యా!" అని పంతులు భుజం కుదిపి వెళ్లి, డ్రైవరు సీటులో కూర్చున్నాడు రాజయ్య.

బస్సు కదిలిపోయింది.

పంతులు మనస్సులో అదో రకమైన అనుమానం పీడించింది, రాజయ్య అనవసరంగా తనపట్ల చూపుతున్న స్నేహభావం చూసి. బస్సుచార్జీ డబ్బులు మిగిలినందుకు ఒక వైపు సంతోషపడ్డా, మరో వైపు రాజయ్యతో ఇలా పొత్తు కలుపుకుంటే, ముందుకు ఏం మూడుతుందోనన్న ఆందోళన కలిగింది పంతులుకు.

రామ్మూర్తి తెనాలి వెళ్లి వచ్చాడు. ఉద్యోగం కోసం వెళ్లిన పని సఫలం కాలేదు. సిఫారసు చేయించుకున్నా, పొగాకు కంపెనీవాళ్ళు "ఇప్పుడున్న ఖాళీ భర్తీ అయిపోయింది. ఆర్నెల్ల తరువాత కనబడు. చూద్దాం" అన్నారట. చాలీ చాలని తన జీతానికి, ఏదో నాలుగురాళ్ళు ఆదనంగా కలుపుతాడుగదా ఉద్యోగంలో కుదిరితే అని పంతులు తన పెద్ద కొడుకుమీద పెట్టుకున్న ఆశ కాస్త హూనమయింది.



కళాదృష్టి

చిత్రం—అనుముల శ్రీహరి (హైదరాబాద్)

ఒక పదిహేను రోజులు గడిచాయి. ఆ రోజు సాయంత్రం బడిపిల్లలకు పంతులు ట్యూషను చెబుతూండగా, అయ్యరు హొటలునుంచి సర్వరు ఒకడు వచ్చి "సార్, మిమ్మల్ని రాజయ్య గోరు అర్జంటుగా పిల్చుకురమ్మన్నారు. ఏదో ముఖ్య విషయం మీతో మాట్లాడాలంట" అన్నాడు.

ఆ మాటలు వినటంతోటే చిదరింపు పుట్టుకువచ్చింది పంతులుకు, 'మళ్లీ ఎక్కడ దాపురించాడురా ఈ రాజయ్య' అని. 'నాకూ, అతనికీ మధ్య ఏం ముఖ్య విషయం తగలడింది?' అని చిర్రెత్తుకొచ్చి క్షణంసేపు 'నేనిప్పుడు రావటానికి వీల్లేదు పో' అని చెప్పేద్దామనుకున్నాడు. కానీ, మరుక్షణమే రాజయ్య అంతవరకూ తనపట్ల చూపిన అభిమానానికన్నా ఇప్పు డెళ్లకపోతే రేపు ఎప్పుడేనా దారిలో కనబడ్డప్పుడు పట్టుకొని తన్నినా తన్నేరకమే అన్న భయం, పంతులిని అలా చెప్పనీయలేదు. "ఒరే రామ్మూర్తీ, పిల్లలకు పాఠాలు చెబుతూండు. ఇప్పుడే వస్తా" అని అంగవస్త్రం భుజాన వేసుకుని సర్వరు వెంట బయల్దేరాడు.

"ఏం పంతులూ, మీవాడికి ఉద్యోగం దొరికిందా?" అనడిగాడు రాజయ్య, పంతులు హొటల్లోకి అడుగెట్టగానే.

పెదిమలు విరిచి "లేదు రాజయ్యా. వాళ్లు ఇంకా ఆరునెలలు వాయిదా పెట్టారు" అంటూ బెంచిమీద కూర్చున్నాడు పంతులు.

"అరె, దొరుకుతుందనుకున్నానే" అని సానుభూతిపూర్వకంగా అని రాజయ్య "పోన్లే దాని తాడు! అదొక్కటేనా ఉద్యోగం? మీవాడు మోటారు మెకానిక్ పని నేర్చుకుంటాడా చెప్పు? నేను కుదురుస్తా వాడిని పనిలో" అన్నాడు పౌరుషం ఉట్టిపడేలా.

"మెకానిక్కు పనా?" అని, అదెందుకన్నట్టు దీర్ఘం తీశాడు పంతులు.

దాన్ని చూసి "నువ్వొట్టి సచ్చుపీనుగవు పంతులూ. ఆ గుమాస్తా ఉద్యోగం ఎన్నేళ్ల చేసినా ఒక్క దమ్మిడీ వెనకెయ్యగలడా — కాగితాలమీద రాసి, రాసి చేతులు సచ్చుబడిపోతయే గాని? అంతెందుకు? ఇన్నేళ్ళుగా నువ్వి పంతులు ఉద్యోగం చేస్తూండావుగదా, ఏమాత్రం డబ్బు కూడబెట్టావ్ చెప్పూ? ఒక్క చిల్లిగవ్వయినా లేదుగదా! అదే యిప్పుడు వాడు మెకానిక్‌గా తయారయ్యాడంటే, రేపు చూస్తూండు రెండు చేతుల్తో డబ్బు గుంజకోకపోతే ఏమని నన్నడుగు. మెకానిక్ పనంటే ఏదో కూలోడి పనను కున్నావుగావాలె?" అని ఉద్రేకంతో హితవు చెప్పాడు రాజయ్య పంతులికి.

అతని మాటలు పంతులు మనస్సుకు బాగా తగిలాయి. "నిజంగా కుదర్చగలవా, రాజయ్యా" అని ఆత్రంతో అడిగాడు.

జవాబుకోసం నిరీక్షిస్తూ ముడతలుబడ్డ పంతులు ముఖంలోకి రాజయ్య క్షణంసేపు తీక్ష్ణంగా చూసి, ప్రేక్షకులందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తగల ఏదో గొప్ప గారడీ చేయబోతున్న ఇంద్రజాలికుడిలా పోజుపెట్టి, గళ్ల తువ్వాలును విసురుగా భుజాన వేసుకుని లేచి, రెండడుగులు ముందుకువేసి, చివాల్న వెనక్కి తిరిగి "ఇక ఆ సంగతి నాకు వదిలెయ్యవయ్యా. నేను చూసు కుంటాగా" అని ఒక్క అంగలో హోటలుదాటి వెళ్లిపోయాడు.

ఆశ్చర్యంతోపాటు ఆనందంకూడ ఆవరించిన పంతులికి యింటికెళ్లుతున్నంతసేపూ, ఆ ఊళ్లో అంత మోతుబరి ఆసామి కుటుంబరావు తన కుమారుడి ఉద్యోగంకోసం చేసిన సిఫారసే ఫలించకపోగా, ఈ బస్సు డ్రైవరు రాజయ్య తెల్లారుస్తాడా అన్న అనుమానం కలగక పోలేదు.

కానీ, ఆశ్చర్యం! మళ్లీ నెల తిరక్కముందే రామ్మూర్తికి తెనాలిలో ఒక మోటారు కంపెనీలో మెకానిక్ పని నేర్చుకోటానికి ఉద్యోగం దొరికింది. భోజనంతోసహా పని నేర్చుకుంటున్నంత కాలం నెలకు నలభై రూపాయలు ఖర్చులకుగాను కంపెనీ యిస్తుందట. అంత వరకూ కంపెనీ కొట్లోనే మకాం పెట్టాలట.

పంతులికి ఆ వార్త వినగానే రాజయ్యను ఏకంగా పొగిడేస్తూ అమాంతంగా ఓ ఆశుపద్యం అల్లెయ్యాలన్నంత సంబరం పుట్టుకువచ్చింది. 'రాజయ్య రౌడీ కాడు. నా కుటుంబం పాలిటి పెన్నిధి!' అని పదేపదే అనుకున్నాడు. కుమారుడి ఉద్యోగంకోసం వాళ్లచుట్టూ, వీళ్లచుట్టూ కాళ్లరిగిపోయేలా తిరిగాడు. కాని ఆఖరికి కలలోగూడ ఎదురు చూడని రాజయ్యద్వారా రామ్మూర్తి ఉద్యోగస్థుడయ్యాడన్నమాట! ఎంత విచిత్రం!

మరునటి రోజు పంతులు, రాజయ్య తన కుమారుడికి చేసిన సహాయానికి కృతజ్ఞత తెలుపటానికోసం అతన్ని బస్సు స్టాండులో కలుసుకున్నప్పుడు "ఏమయ్యోవ్ పంతులూ! మీవాడి సౌకర్యాలన్నీ తెనాలిలో నేను చూసుకుంటాలే. కాని, వాడుమాత్రం ఒళ్లు దాచుకోకుండా పనిజెయ్యాలి తెలుసా? లేపోతే నేనా మేనేజరు కిచ్చిన మాట దక్కదు. సరేనా?" అన్నాడు రాజయ్య.

"అలాగే రాజయ్యా, ఆ పూచీ నాది" అని హామీ యిచ్చాడు సంతోషాతిరేకంతో పంతులు. కానీ రెండు రోజులుగా పంతులు మనస్సులో ఉప్పెనలా ఎగసి ఉరకలేసిన ఆనందపుటలలు కాస్త యథాస్థితికి రాగానే అతన్ని ఓ పెద్ద సందేహం పీడించింది — రాజయ్య, అందరినీ హడలగొట్టే రాజయ్య తనమీద ఎందుకింత ప్రత్యేకాభిమానం చూపుతున్నాడని. ఆ సందేహాన్ని కొంత వరకూ తీర్చగలిగాడు బస్సు స్టాండు దగ్గిరి హోటలు ప్రొప్రయిటరు రామనాథయ్యరు. ఓరోజు పంతులు అతనితో ఏదో పిచ్చాపాటీ మాట్లా[illegible]ాండగా రాజయ్యను గురించి ప్రస్తావన[illegible]చ్చి అతనన్నాడు "బ్రహ్మన్న సార్, మీరు చా[illegible] అదృష్టవంతులు. రాజయ్యకొడుకు ప్రభాకరు[illegible]డూ? వాడు అతనితో మిమ్మల్ని గురించి చాల గొప్పగా చెబుతూంటాడట. అసలే రాజయ్యకి వాడంటే అమిత ప్రాణం. కుర్రాడు బాగా చదువుకుంటున్నాడాయె మరి. అంచేత వాడేం చెప్పినా వింటాడు. ఎలాగూ మీమీద అతనికి మంచి మనస్సు పడింది. మీ కోసం ఇక ఎంతైనా సహాయం చేస్తాడు. కొంచెం మోటుతరహాగా ప్రవర్తించినా, తను మంచివాళ్లని నమ్మినవాళ్లకు తేడక్కుండానే తన చేతనైనంత సహాయంచేసే సుగుణం ఉంద తనిలో. ఎలాగూ మీరు అదృష్టవంతులే సార్" అని.

మౌనంగా ఆ మాటలు వింటూ ఉండిన పంతులు మనస్సులో రాజయ్యపట్ల కృతజ్ఞత మూర్తీభవించి రెండు అశ్రుకణాలుగా ఉబికింది అతని కళ్లల్లో. ప్రభాకరుని మనస్సులోనే తనివి దీర దీవించాడు.

ఒకరోజు రాత్రి రాజయ్య అంకమ్మ యింటికి వెళ్లుతూ పంతులింటివద్ద ఆగి అతన్ని పిలిచాడు. పంతులు బయటికి వచ్చి రాజయ్యను పోల్చుకోగానే అమితానందంతో "రా రాజయ్యా లోపలికి. ఇక్కడ నిలుచున్నావేం?" అని యింట్లోకి దారి తీయబోయాడు. కాని రాజయ్యకు పంతులిల్లు ఎంతమాత్రందో తెలుసుగా? నగం సంసారం ఇంట్లో ఉంటే, సగం వసారాలో ఉండవలసిందే. అందుకని పంతులు భుజం పట్టుకుని "లోపలి కెందుకులే. ఇటు రావయ్యా" అని వీధి లాంతరు దగ్గరకు లాక్కుపోయాడు రాజయ్య.

పంతులు ఏమిటా సంగతని ఆలోచిస్తున్నాడు. రాజయ్య తన పొట్టమీది కవచంలాంటి బెల్టుకు పొదిగిన పర్సులోంచి డబ్బుతీసి ఇరవై అయిదు రూపాయలు లెక్కపెట్టి పంతులు చేతికిస్తూ "ఇదుగోనయ్యా, మీవాడు మొదటి జీతంలోంచి నీకివ్వమని ఇచ్చాడు" అన్నాడు.

పంతులు ఆ డబ్బు చూడగానే సంతోషంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. ఆ రూపాయనోట్లను తన పంచె కట్టులో దోపుకుని "యింకేమైనా చెప్పాడా, రాజయ్యా, మావాడు?" అని ఉత్సాహంతో అడిగాడు.

"ఊ ముందర ఇరవయ్యే ఈయబోయాడు. 'మీ నాయ నాడ డబ్బుచాలక తంటాలు బడుతుంటే అంతా ఊరికే ఖర్చు చెయ్యబాకు' అని నేనే యిరవై అయిదు లాక్కొచ్చా" అన్నాడు రాజయ్య.

రాజయ్య చేతులు పట్టుకుంటూ "చాల సంతోషం, రాజయ్యా. నిన్నే ముహూర్తాన కలుసుకున్నానోగానీ నువ్వు నాకింత సహాయపడతావనుకోలే. అయినా యింత చేసినందుకు నీకు నేనేం చేయగలనో చెప్పు" అని ప్రాధేయపడ్డాడు పంతులు.

పంతులు చేతులు వదలించుకుని, తాపీగా

# అవ్యక్తక్షణం

కె. ఎస్. ఎన్. మూర్తి

నవ్య రమ్య హర్మ్యాలు
గుండెల్లో కదుల్తూంటే,
జ్యోతిర్మయ కాంతులు
కళ్ళల్లో వెలుగుతూంటే,
గులాబీ పరిమళం మదిలో
గుప్పుమంటూంటే,
అవధులు దాటిన ఆనందం
ఉరకలు వేస్తుంటే,
ప్రపంచ మంతా...
ఇంద్రధనుస్సు రంగులతో
శీతాంశుని దరహాసంతో
తారల వెలుగుజిలుగులతో
అనంతమైన కాంతిపుంజంతో
సముద్రం కన్నా గంభీరంగా
శూన్యంకన్నా లోతుగా,
జలపాతంకన్నా ఉరవడిగా,
పిల్లగాలికన్నా [illegible]గా
పలకరిస్తుంటే,
పాట పాడ్తుంటే,
మై మరపిస్తుంటే,
...పిలుస్తుంటే,
కాలం స్తంభించితే,
ప్రకృతి నిలచిపోతే,
అనుభూతితో తేలిపోతే,
ఒళ్ళుమరిచి పోతే,
నయనాలునిండిన అశ్రువులు జారి
ఒళ్ళంతా తడిపేస్తుంటే,
హిమసన్నిభమౌ సమీరం
నన్ను తాకుతూ
నిట్టూరుస్తూ సాగిపోతూంటే,
వికటంగా, కఠినంగా,
స్ఫుటంగా
రక్తారుణభానుడు
ఉదయిస్తూం
రాగా లాపన చేస్తూ,
సంతృప్తిగా,
వైరాగ్యంగా,
అందంగా.........
ఫక్కున నవ్వుతాను.

రాజయ్య మొదలెట్టాడు. "ఏం లేదు పంతులూ. నీకు తెలుసో తెలీదోగాని నాకిద్దరు భార్యలు. మొదటి దానికి ముగ్గురు మొగపిల్లకాయలైతే ఒక్కడికన్నా చదువు అంటలా. 'నేను చదువుకో లేదు గదా మీరన్నా బాగు పడండిరా' అని బడికి పంపిస్తే, బడి ఎగ్గొట్టి ఒకడు కోనేట్లో ఈత గొట్టడం, యింకొకడు చెరువులో చేపలు బట్టడం నేర్చుకున్నారు. 'పుస్తకాలు కొనండిరా' అని డబ్బిస్తే హోటళ్లకీ, సినిమాలకీ తగలేసే వాళ్లు. ఇంక లాభంలేదని వాళ్లను వాళ్లదారికే వదిలేశా. ఏం జెయ్యమంటావ్ అంతకన్నా? ఇప్పుడు తంటాలు బడతుండారు పెద్దోడు సైకిల్‌షాపు బెట్టుకోని, రెండోవాడు రైసు మిల్లులో గుమాస్తాగా. ఇక మూడోవాడు బడికి పోతూండాడని పేరేగానీ వాడుకూడ వాళ్లన్నల దారే తీసేటట్టుండాడు. అందుకని వాడైనా బాగు పడ్డాడని నాకేమీ నమ్మకంలా పంతులూ. అందుకే వాకు మా చిన్నా క్లాసులో ఫస్టు మార్కులు తెచ్చుకుంటుండాడంటే అమిత సంతోషంగా ఉందయ్యా. వాడు నాతో చాన సార్లు నువ్వయితే క్లాసులో పిల్లకాయల్ని ఊరికే చావబాదకుండా పాఠాలు చెప్తావని చెప్పాడు. వాడికసలు నువ్వంటే గురి. అందుకేగదా నీదగ్గిర తప్ప ఇంకెవరి దగ్గిరా ప్రవేటు చెప్పించుకోనని పట్టుబట్టాడు?'

పంతులు ఆ మాటలకు సంబరపడిపోయి వినమ్రతతో "ఆ నాదేందిలే రాజయ్యా. నాదగ్గిర ట్యూషన్ చెప్పించుకోకపోయినా ప్రభాకరు ఎల్లాగూ ఫస్టుమార్కులు తెచ్చుకోగలడు" అన్నాడు.

"అందుకేనయ్యా. వీడైనా మంచి మార్కులతో యిస్కూలుఫైనలు పాసైతే పైచదువుకు కాలేజికి, నా అన్నీ అమ్ముకోనైనా పంపించా లనుకుంటున్నా. ఏదో వాడికి నీమీద చాన నమ్మకం. అందుకని నువ్వు వాడిని చదువు విషయంలో కొంచెం శ్రద్ధగా చూసుకుంటుండాల."

"కొంచెం ఏంటి రాజయ్యా, వాడు స్కూలు ఫైనల్ గట్టెక్కి కాలేజిలో చేరేదాకా పూచీ నాది. ఆ విషయంలో నువ్వేమీ సందేహపడకు" అని బ్రహ్మన్న పంతులు పూర్తి హామీ యిచ్చాడు.

"అంతేనయ్యా పంతులూ, నాక్కావాల్సింది. యింక పద యింటికి. పొద్దుబోయింది. అక్కడ నాకోసం అంకి కాసుకోనుంటాది" అని తృప్తిగా వెళ్లిపోయాడు రాజయ్య, పంతులుని ఇంటికి సాగనంపి.

రాజయ్యను రౌడీ, మర్యాద తెలీని మోటు మనిషిగా భావించాడేగాని అతనికి చదువుమీద ఇంత గొప్ప అభిమానం ఉందని ఎప్పుడూ ఊహించలేదు పంతులు. అయినా రాజయ్య తనవద్దనుండి ఆశిస్తున్న ప్రత్యుపకారం, తను తన కుటుంబానికి చేసిన సహాయంతో పోల్చిచూస్తే, ఏమంత కఠినమైనది కాదు అనుకున్నాడు పంతులు. ప్రభాకరు స్వత

# నిస్సహాయుడు

పోగా తెలివిగల పిల్లవాడు గనుక వాడి చదువు విషయంలో తన బాధ్యత చాల సులువైనదేనని అభిప్రాయపడ్డాడతను. కానీ ఆ బాధ్యత పంతులు ఊహించుకున్నంత తేలికైనది కాదు!


[కాలం]తోపాటు పరిస్థితులుకూడ మారాయి. [కొన్నాళ్ల] తరువాత రిటైరై పింఛను పుచ్చుకుంటూన్న బ్రహ్మన్నపంతులు ఓరోజు పిడుగులాంటి వార్త విన్నాడు. రాజయ్య చనిపోయాడు. వేగంగా పోతూన్న బస్సు చీరాల దగ్గర రోడ్డు మలుపులో ప్రమాదవశాత్తు ఓ కాలవమీద వంతెన చేస్తున్న గోడకు మోదుకోగా, స్టీరింగుకూ సీటుకు మధ్య పట్టుబడిమృత్యువు వాత బడ్డాడట. ఆ వార్త అతన్నెరిగున్నవారిలో ఆట్టే సంచలనం కలిగించపోయినా, పంతులను మాత్రం ఎవరో తన ఆత్మీయుణ్ణి కోల్పోయినంతగా క్రుంగ దీసింది. అతని మరణం అంకమ్మనూ, వాళ్లమ్మనూ, ప్రభాకరునూ ఏకాకికిని దిక్కులేని వాళ్లను జేసింది. తెనాలిలో ఇళ్లస్థలం ఏదో అంకమ్మ పేరిట వ్రాసిపెట్టాలనే అభిప్రాయంతో ఉండినాడట రాజయ్య. కాని అది జరకగముందే రాజయ్యకు అకాలమరణం సంభవించింది. ఊరుకు అంకమ్మకు మిగిలినది తను ఉంటూన్న నాలుగంకణాల పెంకుటిల్లు, కొద్దిపాటి నగలూను.

నాలుగోఫారం పరీక్షలు వ్రాశాక ప్రభాకరు ఓరోజు పంతులింటికి వచ్చి "సార్, మేము గుంటూరికి పోతున్నాం. వచ్చేయేడు అక్కడే చదువుకుంటాను" అన్నాడు.

"ఏం? స్కూలుఫైనలుదాకా యిక్కడే పూర్తి చేయవోయ్. ఇప్పుడెందుకు గుంటూరు?" అన్నాడు పంతులు, ప్రభాకరు గుంటూరు వెళ్లటం యిష్టంలేక.

"లేదు సార్. ఇక్కడ మాకెవ్వరూ లేరు. అమ్మేశాం. గుంటూరులో మా మేనమామ గారింటికి పోతున్నాం."

వాళ్ల పరిస్థితుల నెరిగిన పంతులు ప్రభాకరుకు మరే విధమైన సలహా యివ్వలేకపోయాడు,



'తాటాకు చప్పుళ్లే'
చిత్రం — పమ్మూరి శ్రీపతి (చిత్తూరు)

తన ఆర్థిక పరిస్థితికూడ అంతంత మాత్రంలోనే ఏడుస్తున్నది కాబట్టి.

"సరే, శ్రద్ధగా చదువుకో. గుంటూరెళ్లాక అప్పుడప్పుడూ నాకు జాబులు వ్రాస్తూండు. ఏం?" అన్నాడు పంతులు నిస్సహాయంగా.

దూరంగా వెళ్లిపోతున్న ప్రభాకరాన్నిచూస్తూ, తను రాజయ్య కిచ్చిన మాట తనకు దక్కకుండా పోతూందేనని ఏదో అవ్యక్తమైన బాధతో కుమిలాడు అతను.

ప్రభాకరు గుంటూరుకు పోయిన మూడు నెలల్లో నాలుగు జాబులు వచ్చాయి పంతులికి. అంతే. మళ్లీ యిక రాలేదు.

ఒకరోజు పంతులికి కండక్టరు గుర్నాథం అయ్యరు హోటల్లో తటస్థపడ్డాడు. "గుర్నాథం, రాజయ్య కుమారుడు గుంటూరెళ్లిపోయిన సంగతి నీకు తెలుసుగా? వాడి సంగతి మళ్లీ నీకేమైనా తెలుసా? ఇప్పుడెలాచదువుకుంటున్నదీ" అని ఆతృతగా అడిగాడు పంతులు.

"చదువా? లేదుసార్. వాడు పాపం చదువుకోవాలంటే వాళ్ల మామ అక్కర్లేదులే అని ఏదో ఆఫీసులో చేర్పించాడంట పని నేర్చుకోమని. అలాగని ఎవరో చెబుతూంటే విన్నాను. నెలకు అరవై జీతమంట...." అనగింజంతైనా సానుభూతి లేకుండా తృప్తిగా కాఫీ చప్పరిస్తూ చెప్పుకుపోతూన్న గుర్నాథం మాటలు అప్పటికే మనోవ్యథతో కుమిలిపోయిన పంతులి కిక వినబడలేదు.

ఆవేదనతో బరువెక్కిన హృదయంతో, పరిపరి విధాల ఆలోచిస్తూ ఇంటికి బయలుదేరాడు పంతులు వెంటనే. ఇల్లు చేరుకోగానే చిరునవ్వుతో అతని భార్య ఎదురయి "రామ్మూర్తి ఉత్తరం వ్రాశాడు....." అంది.

నిస్తబ్బుగా వాలుకుర్చీలో కూర్చుంటూ "ఊఁ..." అన్నాడు పంతులు ఏం వ్రాశాడో చెప్పమని.

"వాడిప్పుడుంటున్న కంపెనీ వదిలిపెట్టి, మరో మోటారు రిపేర్ల కంపెనీలో చేరాడుట. నెలకు రెండువందల రిపాత్రట జీతం." సంతోషంతో ఉక్కిరిబిక్కిరై పోతూ చెప్పింది అతని భార్య.

ఆ వార్త వినటంతోటే క్షణంపాటు సంతోషపడ్డాడు పంతులు. కానీ మరుక్షణమే అతని మనస్సులోని ఆవేదన మరింత ఎక్కువైంది— ఉద్యోగం లేకుండా అలమటిస్తూండిన తన కుమారుణ్ణి తను అడగకుండానే ఇంత ప్రయోజకుడుగా చేసిన రాజయ్య కోరిక అతనితోటే అంతమైపోయినందుకు.

రామ్మూర్తి ఆరోజు అందించిన వార్తకు మురిసిపోతూ కుతూహలంతో గందరగోళంగా ఉన్న ఆ యింట్లో, వాలుకుర్చీలో మేనువాల్చి ఇంటికప్పుకేసి చూస్తూ గాద్గదికంగా "రాజయ్యా నన్ను క్షమించు" అన్న పంతులు మాటలు ఎవ్వరికీ వినిపించలేదు. ★